క్లుప్తంగా

ఏఈసీఎస్‌లో ప్రవేశాలకు 15 వరకు దరఖాస్తులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయంలో 2023–24 సంవత్సరానికి 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు ప్రవేశాలకు ఈ నెల 15 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 వరకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యాలయం కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు ఇస్తారని, నింపిన దరఖాస్తులకు ధ్రువపత్రాలు జత చేసి కార్యాలయంలో ఈ నెల 15 లోపు ఇవ్వాలని ఆయన సూచించారు. 1వ తరగతిలో ప్రవేశానికి 1 జనవరి, 2015 తర్వాత 01ఏప్రిల్, 2017లోపు జన్మించి ఉండాలన్నారు. భారజల కర్మాగారం పరిసర ప్రాంత తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

21న ప్రమాణ స్వీకార మహోత్సవం

భద్రాచలంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం 32వ ప్రమాణస్వీకారం ఈ నెల 21 పట్టణంలోని గోదావరి ఇన్ (లాడ్జి)లో జరుగనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి జి.భరత్ కుమార్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వారు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మోహన్‌రావు, ఎలెక్ట్ గవర్నర్ సీహెచ్ శివప్రసాద్‌లతో పాటు ఇతర అధికారులు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.సూర్యనారాయణ. డా.ఎస్ఎల్ కాంతారావు, లక్ష్మీనారాయణ, పి.దేశప్ప, సోమరౌతు శ్రీనివాసరావు, తిప్పన సిద్దులు, భోగాల శ్రీనివాస్ రెడ్డి, బోనాల సూర్యనారాయణ, అడబాల వెంకటేశ్వరరావు, వెంకటాచార్యులు, అరికెలతిరుపతిరావు, ఎంబి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, ఇండ్ల స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఎం భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. మూడో జోన్ సీపీఎం కమిటీ సమావేశం వార్డు కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన బీసీలకు లక్ష రూపాయల లోన్ సౌకర్యం పేదలందరికీ వర్తింపజేయాలన్నారు. అనంతరం బండారు శరత్ బాబు కన్వీనర్‌గా, ఎస్డీ ఫిరోజ్, ఎస్.శేషగిరిరావు, జై.నాగేంద్రరావు సభ్యులుగా మరో పదకొండు మందితో జోన్ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం సమావేశంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డిలు ప్రసంగించారు.

సంతలో అన్నదానం

చర్ల: చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలకు మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చర్లకు చెందిన టాటా గోల్డ్ షాపు యజమాని దివంగత పిన్నింటి లక్ష్మణరావు వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించగా.. మేమున్నాం సహాయక కమిటీ స్థానిక గాంధీ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. సంతకు వచ్చిన సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేమున్నాం సహాయక కమిటీ చైర్మన్ నీలి ప్రకాశ్, సభ్యులు పరిటాల రమణ, మెంతుల వీర్రాజు, బెజ్జంకి మనోహరాచారి, దొడ్డా ప్రభుదాసు, దొడ్డి రమణారావు, మర్ల ప్రసాద్, రంగు వెంకట్, మర్ల రాజా, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా కార్యదర్శిగా జయ

భద్రాచలంటౌన్: ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా కార్యదర్శిగా భద్రాచలం పట్టణానికి చెందిన మద్దేటి జయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భద్రాచలం పట్టణంలోని ఎంపీ కాలనీలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గాజుల పున్నమ్మ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ నియామక పత్రాన్ని జయకు అందజేశారు. ఈ సందర్భంగా జయ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ.. మహిళా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కుమారి, ఉష పాల్గొన్నారు.

ప్లే స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీలు!

- ఆటపాటలతో చిన్నారులకు బోధన
- అందమైన చిత్రాలు.. ఆకట్టుకునే బొమ్మలు ఏర్పాటు
- కార్పొరేట్ స్థాయిలో నిర్వహణ



భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీలో మోడల్ అంగన్‌వాడీ సెంటర్



కేంద్రంలో బొమ్మలతో ఆడుకుంటున్న చిన్నారులు


అంగన్‌వాడీ కేంద్రంలో డైనింగ్ టేబుల్, కుర్చీలు

భద్రాచలంఅర్బన్: గోడలపై రంగురంగుల అందమైన చిత్రాలు.. ఆకట్టుకునే ఆట బొమ్మలతో అంగన్‌వాడీ కేంద్రాలు ప్లేస్కూళ్లను తలపిస్తున్నాయి. చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆటాపాటలతో చదువు అందుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ ప్లేస్కూళ్లలో నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ సమకూర్చుతున్నది. దీంతో చిన్నారులు ఆడుతూ పాడుతూ చదువుకుంటున్నారు.

కేంద్రాల బలోపేతం దిశగా..

ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చాలా వరకు పేరుకే సెంటర్లు ఉండేవి. నిధులు లేక అరకొర వసతులతో కొనసాగేవి. అక్కడి పరిస్థితులను చూసి పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబర్చేవారు కాదు. అలాంటి అంగన్‌వాడీ కేంద్రాల దశ ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మాతా శిశు సంరక్షణలో భాగంగా దశల వారీగా నిధులు విడుదల చేస్తూ అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేసింది. అన్ని వసతులతో చాలా వరకు పక్కా భవనాలను నిర్మించింది. గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోంది.

అన్ని రకాల సౌకర్యాలు..

దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 173 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో భద్రాచలంలో 38 ఉండగా, దుమ్ముగూడెం పరిధిలో 135 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొదటి విడతలో 27 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండో విడతలో 4.. ఇలా కొన్నింటిని మోడల్ అంగన్‌వాడీ సెంటర్లుగా ఎంపిక చేశారు. ఈ సెంటర్లలో పక్కా భవనాలను నిర్మించారు. గోడలపై రంగురంగుల కార్టూన్లు, అక్షరాలు, పదాలు నేర్చుకునేందుకు అర్థమయ్యే రీతిలో చిత్రాలను వేశారు. ఆటవస్తువులు, టెలివిజన్, బోధనా సామగ్రిని సమకూర్చారు. మరుగుదొడ్లు, ప్రహరీ, తాగునీరు, కుర్చీలు వంటి అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఆయా మోడల్ సెంటర్లలో చిన్నారులకు ప్రత్యేక హాల్, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ప్రత్యేక గది, వంటశాల ఉన్నాయి. కార్పొరేట్ స్థాయి ప్లేస్కూల్ మాదిరిగా సౌకర్యాలు కల్పించడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్ వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

టీచర్లకు గౌరవం పెరిగింది..



ఒకప్పుడు అంగన్‌వాడీ సెంటర్లలో ఎలాంటి సౌకర్యాలూ ఉండేవి కావు. పిల్లలను తల్లిదండ్రులు పంపించేవారు కాదు. అంగన్‌వాడీ వర్కర్లుగా మాకు గుర్తింపు కూడా ఉండేదికాదు. ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మౌలిక వసతులు కల్పిస్తోంది. ప్లేస్కూళ్ల మాదిరిగా తీర్చిదిద్దడంతో పిల్లలు ఉత్సాహంగా వస్తున్నారు. మాకు కూడా సమాజంలో గౌరవం పెరిగింది.

– విజయమ్మ, అంగన్‌వాడీ టీచర్, భద్రాచలం

ప్రభుత్వ సహకారం బాగుంది..



అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పటి ప్రభుత్వాలు నిధులు ఇచ్చేవి కాదు. మేము ఎంత కష్టపడ్డా ఫలితం ఉండేది కాదు. కానీ ప్రత్యేక రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి కావాల్సినన్ని నిధులు ఇస్తున్నారు. ప్రభుత్వం సహకారం బాగుంది. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్యను పెంచేందుకు సిద్ధంగా ఉన్నాం. మరోవిడతలో అది సాధ్యమౌతుంది.

– నవ్యశ్రీ, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్టు

సిద్ధమైన పాఠశాలలు


ప్రభుత్వ పాఠశాలలో శుభ్రం చేస్తున్న కార్మికులు

అశ్వారావుపేటరూరల్: వేసవి సెలవులు ముగిసిపోవడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తిరిగి సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలలు తెరుచుకొనున్న నేపథ్యంలో ఆదివారం అశ్వారావుపేట, పేరాయిగూడెంతోపాటు పలు గ్రామాల్లోగల ప్రభుత్వ పాఠశాలల ఆవరణలను పారిశుధ్య కార్మికుల ఆధ్వర్యంలో శుభ్రం చేసే పనులు చేపట్టారు. ఆయా పాఠశాలల పరిసరాలను శుభ్రం చేసి, చెత్తచెదారాన్ని తొలగించారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 255 మంది ప్రభుత్వ ఉపాధ్యాయలకు గాను 52 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా కొండరెడ్ల గ్రామమైన గోగులపూడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేడు. ఈ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాల్సి ఉంది.

వృద్ధాశ్రమానికి వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సరోజిని వృద్ధాశ్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఫినాయల్ బాక్సులను వితరణగా ఇచ్చారు. ఆశ్రమంలో నడవలేని వృద్ధులు, వికలాంగులు ఎక్కువగా ఉండడంతో ప్రతిరోజూ శుభ్రం చేయకుంటే దుర్వాసన రావడం, దానికి ఫినాయల్ ఎక్కువ అవసరం అవుతుండడాన్ని నిర్వాహకురాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన.. పట్టణ కాంగ్రెస్ నాయకుల ద్వారా సుమారు రూ.42 వేల విలువ చేసే ఫినాయల్ బాక్స్‌లను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, వెంకటేష్, సుధీర్, మణికంఠ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

అశ్వాపురం: మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయి కట్టుబట్టలతో వీధిన పడ్డ చాప పాపారావు కుటుంబానికి ఆదివారం పలువురు చేయూత అందించారు. దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, వంట పాత్రలు, దుస్తులు పంపిణీ చేశారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తారా ప్రసాద్ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకుడు బట్టా విజయగాంధీ, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి భిక్షమయ్య బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నగదు అందజేశారు.

బూడిద నివారణ చర్యలపై హర్షం

మణుగూరురూరల్: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వెలువడే బూడిద వల్ల కలిగే నష్టాలను నివారించేందుకు చర్యలు చేపట్టడంపై సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న ప్రజాపంథా నాయకులతో కలిసి బూడిద చెరువును, ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. బూడిద నివారణ చర్యలను చేపడతామని, ప్రజలెవ్వరు అధైర్యపడొద్దని బిచ్చన్న తెలిపారు. బూడిద లేవకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేసి స్ప్రేయింగ్ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి


విద్యార్థులకు షీల్డు అందజేస్తున్న సీఐ నాగరాజు రెడ్డి

భద్రాచలంటౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి అన్నారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో 40 రోజుల పాటు నిర్వహించిన ఉచిత ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంపు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడారు. క్రీడాల్లో రాణించడం ద్వారా కూడా ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇటువంటి శిక్షణ కార్యక్రమం నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. అనంతరం ముగింపు సందర్భంగా నిర్వహించిన ఫుట్‌బాల్ మ్యాచ్ విన్నర్, రన్నర్లకు బహుమతులను అందజేశారు. కోచింగ్ క్యాంపులో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ సర్టిఫికెట్లు అందజేశారు. భద్రాచలం ఫుట్‌బాల్ అసోయేషన్ సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతువాడ జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా చర్లకు వచ్చే ప్రదాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్ట్, కలివేరుద్రాస్ రోడ్, కుర్నపల్లి క్రాస్‌రోడ్‌లలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న అనంతరం వారిని విడిచిపెట్టారు.

ముమ్మరంగా సాగు పనులు


అరకలతో భూమిని సిద్ధం చేస్తున్న రైతు


ట్రాక్టర్‌తో దుక్కి పనులు..

బూర్గంపాడు: వానాకాలం పంటల సాగు షురూ అయింది. రైతులు భూములను దుక్కులు చేసి విత్తనాలు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లో రైతులు పొడిదుక్కులలోనే పత్తిగింజలు వేస్తున్నారు. కొందరు రైతులు భూములను దుక్కులు చేసి విత్తనాలు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా మాగాణుల్లో పచ్చిరొట్ట ఎరువుగా జీలుగులు చల్లుతున్నారు. వరినార్లు పోసుకునేందుకు నారు మడులను సిద్ధం చేస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రానికి నైరుతి రుతుపవనాలు వస్తాయని వాతావరణశాఖ సూచనలతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. ఈ ఏడాది రుతుపవనాలు వారం రోజులు ఆలస్యం కావటంతో పంటల సాగుపై ప్రభావం పడుతుందని రైతుల సాగుపనులు తొందర చేశారు.. వర్షాలు కురిస్తే సాగు పనులు మరింత ముమ్మరం కానున్నాయి.

3కే రన్‌ను విజయవంతం చేయాలి

అశ్వాపురం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మణుగూరులో సోమవారం జరిగే 3కే రన్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే 3 కే రన్‌లో మండలంలోని యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, రన్‌లో పాల్గొనే వారందరూ ఉదయం 5 గంటలకు అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఆయన కోరారు.

నేడు కంటివైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోని పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 12న ఉచిత కంటివైద్య శిబిరం నర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవరమైన వారికి అపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

ఆలయానికి విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్రస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన ఇంటిలిజెన్స్ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్ ఆదివారం రూ.లక్షా 116 విరాళంగా కుటుంబసభ్యులతో కలిసి ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, కాసరబాద రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, పాటి మన్మథరెడ్డి, ఎడ్ల ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన బసనబోయిన వెంకన్న (34) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతుని కుటుంబసభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, ఎమ్మెల్యే సీతక్క కుమారుడు ధనసరి సూర్య స్థానిక నాయకుల ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వెంకన్న మృతదేహానికి ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ పాడియం సుజాత, మాజీ సర్పంచ్ అనిల్ నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

సీపీఎం నాయకుడు మృతి

అశ్వారావుపేటరూరల్: అనారోగ్యంతో సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు ఆదివారం మృతి చెందారు. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన దానపు మునయ్య(55) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ.. పరిస్థితి విషమించి మృతి చెందారు. పార్టీ జిల్లా నాయకుడు కొక్కెరపాటి పుల్లయ్య, స్థానిక నాయకులు బి.చిరంజీవి, గంగరాజుతోపాటు మరికొంత నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రీడాకారులకు బహుమతి ప్రదానం


విజేత జట్టుకు నగదు బహుమతి అందిస్తూ..

ములకలపల్లి: మండలపరిధిలోని పూసుగూడెంలో నిర్వహిస్తున్న భూక్యా హరిలాల్ మెమోరియల్ కప్ మండలస్థాయి క్రికెట్ పోటీల ప్రథమ, ద్వితీయ విజేతలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, సీతారాంపురం సర్పంచ్ సున్నం సుశీల చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం చేశారు. ప్రథమ విజేత పూసుగూడెం–1 టీంకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అందించిన 10 వేల రూపాయల నగదుతోపాటు ట్రోఫీని వారు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండవీటి రాజారావు, హనుమంతరావు, గ్రామస్తుల అమర్‌సింగ్, భూక్యా నంద, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కవులకు ఘన సన్మానం


వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన సాహిత్య దినోత్సవ వేడుకల్లో అశ్వారావుపేటకు చెందిన ఇద్దరు కవులను ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ వేడుకల్లో అశ్వారావుపేటకు చెందిన కవులు సిద్దాంతపు ప్రభాకరచార్యులు, మడిపల్లి వెంకటేశ్వరరావులు కవి సమ్మేళనంలో పాల్గొని కవితా పఠనం చేశారు. అనంతరం వారిని డీపీఆర్ఓ శీలం శ్రీనివాస్, విద్యాశాఖ సీఎంవో సైదులు, ప్లానింగ్ కో ఆర్డినేటర్ సతీష్ చేతుల మీదుగా శాలువా కప్పి, జ్ఞాపికలు అందించారు.

ఉత్తమ ఉద్యోగికి..


మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏరియా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన ఎస్అండ్‌పీసీ ఉద్యోగి బండారు జయరాజును సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేఈ కోట శ్రీనివాస్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మేకల ఈశ్వర్, కార్యదర్శి పీక శంకర్, కాసర్ల అనిల్‌కుమార్, సంజీవరావు, బి.రాజలింగు, బి.వెంకటరత్నం, దేవేందర్, మార్క్స్, రవిబాబు, భార్గవ్, వెంకటేశ్వర్లు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు.. తాము పది పూర్తి చేసుకుని 25 సంత్సరాలు గడిచిన సందర్భంగా ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. తొగ్గూడెంలో సమ్మక్క–సారలమ్మ ఆలయం వద్ద పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో ఉన్న పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరారు. గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సరదాగా గడిపారు. గురువులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన కంసాని శ్రీనివాసరావును శాలువాతో సన్మానించారు. ఈ సమ్మేళనంలో కంసాని శ్రీనివాసరావు, షహనాజ్‌భేగం, జ్యోతి, సంధ్య, శివ, సమ్మిరెడ్డి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కల్వర్టు



మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి పలు చోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. పెట్రోల్ బంక్ ఎదుట కల్వర్టు రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉంది. పిచ్చి మొక్కలు పెరిగి వాహనదారులు దగ్గరికి వచ్చేదాక కూడా కల్వర్టు కనబడటం లేదు. నిత్యం వాహనాలు తిరిగే రహదారి కావడంతో కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని, కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: రాంబాబు, ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్ నంబర్: 9441435367